# కాగితాలపైనే కేంద్రాలు

మొదటిపేజీ తరువాయి...

యంత్రాగం చెబుతున్నది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నది. నేటికీ 50శాతం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. ప్రారంభమైన చోట తేమ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కొన్నిచోట్ల ధాన్యం ఎండబెట్టినప్పటికీ.. వెంటనే కొనుగోలు చేయకపోవడంతో ఇటీవల కురిసిన జల్లులతో మళ్లీ తడిసింది. దీంతో రైతులు మళ్లీ ఆరబోయాల్సిన దుస్థితి ఏర్పడింది.

### తెగనమ్ముకుంటున్న రైతులు

కేంద్రాల్లో ఉన్న ఇబ్బందుల నేపథ్యంలో అన్నదాతలు చేతికొచ్చిన ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు, పలువురు రైస్‌మిల్లర్లు క్వింటాల్‌కు రూ.1800 చొప్పునే ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం ఫైన్ రకాలకు క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకాలకు రూ.2,183 మద్దతు ధర ఉంది. ఈ లెక్కన క్వింటాల్‌పై రూ.400 వరకు రైతులు నష్టపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని చేతులెత్తింది. ఒక వేళ ఇచ్చినా వ్యాపారులకు విక్రయించిన రైతులకు బోనస్ వర్తించదు. కొనుగోలు కేంద్రాల్లో ఇలాంటి పరిస్థితులు ఉన్నా మంత్రులెవరూ అటువైపు కన్నెత్తి చూడకపోగా.. అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారు.



సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరు పీఏసీఎస్ సెంటర్‌లో రైతులు ఆరబోసిన వడ్లు



### ఇద్దరు ముగ్గురివే కొన్నరు

నలుగురు రైతులం కలిసి పదిరోజుల కింద పెద్దూరు సెంటర్‌కు వడ్లు తెచ్చి ఎండబోత్తున్నం. రోకళ్లు పగిలేట్టు కొడుతున్న ఎండకు వడ్లు మంచిగెండినయ్. నోట్లేసుకుంటే పళ్లు మంటున్నయ్. తాళ్లులేవు. బెడ్డలు లేవు. సూద్దామన్నా రాళ్లు లేవు. గింత మంది రైతులు ఎండబెట్టిన వడ్లను 15 రోజులయితన్నా ఇద్దరుముగ్గురియే కొన్నరు. గిదేంది సారని అడిగితే వడ్లు ఎండలేదంటున్నరు.

*- గొడుగు ఎల్లయ్య, పెద్దూరు (సిరిసిల్ల అర్బన్ మండలం)*



## మరీ ఇంత నిక్కృష్ట రాజకీయమా?

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌కు రాష్ట్రం, రైతు ప్రయోజనాలకంటే రాజకీయాలే ముఖ్యమని మరోమారు తేలిపోయిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. మేడిగడ్డ వద్ద కాఫర్‌డ్యాం కట్టి, మరమ్మతులు చేసి నీళ్లు ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలని కేసీఆర్ డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. నీటిపారుదల శాఖ ఇంజినీర్ల నివేదిక తర్వాత మరమ్మతులు చేస్తామని ఎల్అండ్‌టీ ముందుకు వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చిల్లర రాజకీయం చేస్తూ రైతుల జీవితాలతో చెలగాటం అడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న ఒకేఒక్క అజెండాతో కాఫర్ డ్యాం కట్టకుండా రైతులను నిండా ముంచాలని చూస్తున్నదని ఆరోపించారు. ఇంత నిక్కృష్ట రాజకీయం ఎన్నికల్లో లాభం కోసమేనా? అని కేటీఆర్ ప్రశ్నించారు.

**SALAR JUNG MUSEUM, HYDERABAD**

**e-Publishing Notice**

Tenders are invited under e-publishing platform for **Laying, Fixing and Polishing Work of Italian Marble as per Architectural drawings at Ground Floor Western Block Auditorium Entrance and Centre Foyer in Salar Jung Museum** (Labour Charges only).

Tenderers can download the tender schedules from procurement site i.e www.eprocure.gov.in/CPPP. Submission of tenders offline at Salar Jung Museum, Hyderabad.

| | | |
|---|---|---|
| Bid publish date | : | 17.04.2024, 10.00 AM |
| Bid Submission closing date | : | 02.05.2024, 3.00 PM |
| Bid opening Date | : | 02.05.2024, 3.30 PM |

Further details can be seen at www.eprocure.gov.in/cppp.

- Tender ID:2024_SJM_753462_1

Sd/-
DIRECTOR

## స్టార్టు అయింది.. కిలో కొనలేదు



మార్కెట్ స్టార్టు అయిందని వడ్లు తెచ్చినం. వచ్చిన వడ్లు వచ్చినట్టే ఉంటున్నయి. ఏమైంది సార్ అంటే.. పట్టించుకునేటోడు లేడు. మూడు దినాలుగా మూడు నాలుగు సార్లు వాన జల్లులు పడ్డయి. మార్కెట్‌కు తెచ్చిన ధాన్యం తడువకుండా కుప్పలపై టార్పాలిన్లు కప్పుకుంటూ నిద్రలేని రాత్రులు గడుపుతున్నం. ఎండినప్పుడు కొనకపోయే సరికి.. వర్షానికి మళ్లీ తేమ శాతం పెరిగింది. అంతా అధికారుల కండ్ల ముందే జరుగుతున్నా ఏమాత్రం దయ జూపడం లేదు.

*- లక్కాకుల శ్రీనివాస్, రైతు (గొల్లపల్లి)*

## 18 రోజులైనా కిలో ధాన్యం కొనలె

### గొల్లపల్లి మార్కెట్‌లో రైతుల దయనీయ పరిస్థితి

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని 18 రోజుల కింద ప్రారంభించారు. రైతులు భారీగా యార్డుకు ధాన్యం తెచ్చారు. కానీ నేటి వరకు ఒక్క కిలో ధాన్యం కొనలేదు. మాయిశ్చర్ పేరుతో కొనకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజుల కిందట వచ్చిన మబ్బులకు మార్కెట్‌లో పోసిన ధాన్యం కాపాడుకునేందుకు నానా పాట్లుపడ్డారు. ఈ మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్లను గొల్లపల్లి సహకార సంఘం చేస్తుంది. ఇంకా గన్నీ సంచులు కూడా రాలేదు. కొనుగోలు చేసిన ధాన్యం తరలించేందుకు మిల్లు అలాట్‌మెంట్ కూడా జరుగలేదు. జిల్లా అధికారులు స్పందించి మార్కెట్‌లో పేరుకుపోయిన ధాన్యాన్ని త్వరగా కొనుగోలు జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఇక్కడకు వచ్చిన ధాన్యంలో 80 శాతం ధాన్యం మిల్లర్లే కొనుగోలు చేస్తున్నారు. మొదట క్వింటాల్‌కు రూ.1800 పెట్టిన మిల్లర్లు, ఇప్పుడు రూ.1700 మాత్రమే ఇస్తున్నారు. లేదంటే 'మీ ఇష్టం' అంటూ రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అందినంత దండుకుంటున్నారు.



జగిత్యాల జిల్లా గొల్లపల్లి మార్కెట్ యార్డులో పేరుకు పోయిన ధాన్యం కుప్పలు



### మిల్లులకు పోతే ఏ లొల్లిలేదు

సెంటర్లకు వడ్లు తెచ్చి ఇరవై రోజులైతంది. ఎండ సుర్రుమంటుంది. ఇప్పటి వరకు కాంటా పెట్టలేదు. ఇంకెన్ని రోజులుండాలని అడిగితే నీలైన్ రావద్దా? అన్ని గద్దించి పెడతండ్రు. వడగళ్ల వానొత్తే ఎండిన వడ్లు నానితే మళ్ల మొదటికొత్తదని తెల్లందాక పొద్దుందాక ఈడ్నే సత్తున్నం. ఎండి ఎండి గలగల మంటున్నా గింజలను కొనేదిక్కులేదు. మిల్లులకు తీసుకుపోతే ఏలొల్లీ ఉండదు. మా రైతుల గోస ఎవనికి పట్టదాయే.

*- ఆయిలు పర్శరాములు, సిరిసిల్ల*





## చెన్నూర్ రైతుల పోస్టుకార్డు ఉద్యమం



మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట రైతులు వినూత్నంగా పోస్టుకార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గ్రామంలోని రైతులంతా గురువారం లేఖలు రాశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అది చేస్తాం, ఇది చేస్తామని ఇచ్చిన హామీలు ఇంకెప్పుడు అమలు చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. *- మంచిర్యాల, నమస్తేతెలంగాణ ప్రతినిధి*

## ఓటుకు నోటు కేసు జూలై 24 డెడ్‌లైన్

- వాయిదా కోరిన తెలంగాణ ప్రభుత్వం
- ఇదే చివరి అవకాశమన్న సుప్రీం కోర్టు

హైదరాబాద్, ఏప్రిల్18 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసు విచారణను సుప్రీం కోర్టు జూలై 24కు వాయిదా వేసింది. సుప్రీం కోర్టులో గురువారం కేసు విచారణకు రాగా, తెలంగాణ ప్రభుత్వం వాయిదా వేయాలని కోరింది. ఇదే చివరి అవకాశమని, మళ్లీ వాయిదాలు ఇచ్చేదిలేదని సుప్రీం కోర్టు స్పష్టం చేస్తూ జూలై 24కు విచారణను వాయిదా వేసింది. విచారణ అనంతరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని మండిపడ్డారు. 'ఒక ఓటుకు ఐదు కోట్లు బేరం పెట్టుకున్న చంద్రబాబు ఆడియో బయటపడింది. రూ. 50 లక్షలు ఇస్తూ పట్టుబడ్డ వ్యక్తి రేవంత్‌రెడ్డి. ప్రపంచమంతా చూస్తుండగానే డబ్బు ఇచ్చారు. అన్ని సాక్ష్యాలు ఉన్న ఈ కేసు ముందుకు సాగకపోవడానికి కారణం వ్యవస్థలను మేనేజ్ చేయడమే. ఏడేండ్ల నుంచి కేసును రకరకాల కారణాలతో సాగదీస్తున్నారు. సుప్రీంకోర్టు ఇదే చివరి అవకాశమని స్పష్టం చేసింది. రాబోయే రోజుల్లో చంద్రబాబుకు ఈ కేసులో శిక్ష తప్పదు' అని ఎమ్మెల్యే ఆర్కే చెప్పారు.

## బీఆర్ఎస్ కౌన్సిలర్‌పై పోలీసుల దౌర్జన్యం

- సెర్చ్ వారెంటు లేకుండానే ఇంట్లో సోదాలు
- మహిళలు ఉన్న ఇంట్లోకి చొరబడి తనిఖీలు
- ప్రశ్నిస్తే బైండోవర్ చేస్తానని ఎస్సై హెచ్చరిక
- స్పృహ తప్పి పడిపోయిన కౌన్సిలర్ లక్ష్మి
- కేటీఆర్ జిల్లాకు వస్తున్న వేళ బెదిరింపులు

పెద్దపల్లి, మార్చి 18(నమస్తే తెలంగాణ)/సుల్తానాబాద్: పెద్దపల్లి జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా అక్రమ దాడులు జరుగుతున్నాయి. అందులో భాగంగానే.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ గొట్టం లక్ష్మిపై పోలీసులు దౌర్జన్యానికి దిగారు. ఎలాంటి సెర్చ్ వారెంట్ ఇవ్వకుండానే ఇంట్లోకి చొరబడి సోదాలు నిర్వహించారు. మహిళా కానిస్టేబుళ్లు లేకుండానే గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో గొట్టం లక్ష్మి ఇంటికి పోలీసులు చేరుకున్నారు. ఆ సమయంలో ఇంట్లో ఇద్దరు పిల్లలు, కౌన్సిలర్ లక్ష్మి, కోడలు స్వప్న మాత్రమే ఉన్నారు. తన కొడుకు వచ్చే వరకూ ఇంట్లోకి రావొద్దని చెప్పినా వినిపించుకోకుండా.. సుల్తానాబాద్ ఎస్సై శ్రావణ్ ఆధ్వర్యంలో నలుగురు కానిస్టేబుళ్లు ఇంట్లోకి ప్రవేశించి పత్రాలన్నీ పరిశీలించారు. ఈ సందర్భంగా 'మా ఇంట్లో తనిఖీలు ఎందుకు చేస్తున్నారని కౌన్సిలర్ కుమారుడు గొట్టం మహేశ్ ప్రశ్నించగా.. ప్రశ్నలు అడిగితే బైండోవర్ చేస్తాం. నీవు అక్రమంగా ఫైనాన్స్ వ్యాపారం చేస్తున్నావని ఫిర్యాదులు వచ్చాయి' అని బెదిరించారు. దాదాపు మూడు గంటల పాటు బీరువాలు, ర్యాకులు, కప్‌బోర్డ్స్‌ను తనిఖీలు చేసి, ప్రతి పుస్తకాన్ని, పత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించి వెళ్లిపోయారు. ఎన్నడూ లేని విధంగా పోలీసుల తమ ఇంట్లోకి చొరబడి సోదాలు చేస్తుండటంతో లోబీపీతో బాధపడుతున్న కౌన్సిలర్ లక్ష్మి ఒక్కసారిగా కుప్పకూలారు. ఎస్సై అదేమీ పట్టించుకోకుండానే 'ఏం కాదు.. కంగారు పడొద్దు.. ఆమె బాగానే ఉంటుంది.. మీరు తనిఖీలకు సహకరించండి' అంటూ సోదాలు కొనసాగించారు. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను కుటుంబ సభ్యులు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా.. చికిత్స పొందుతూ రాత్రి వరకు కోలుకున్నది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా పోలీసులు పక్కా స్కెచ్ వేసుకున్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పెద్దపల్లి అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాకు రానున్న సందర్భంగా.. గురువారం పోలీసులు భయానక వాతావరణాన్ని సృష్టించారు. పార్టీ శ్రేణుల్లో అలజడి సృష్టించేందుకే పోలీసులు సోదాల ప్రక్రియకు శ్రీకారం చుట్టారని సర్వత్రా విమర్శలొస్తున్నాయి.



దవాఖానలో చికిత్స పొందుతున్న కౌన్సిలర్ లక్ష్మి

